

సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కాసం వెంకటేశ్వర్లు

## ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న ప్రభుత్వం

### బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

**హైదరాబాద్, డిసెంబరు 9 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినయోగం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన విజయోత్సవాలు జరుపుకుంటుందని బిజెపి రాష్ట్ర కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు మండి పడ్డారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. లేజర్ షోలు, డ్రోన్ షోలు, ఎయిర్ షోలు, మ్యూజికల్ నైట్స్ ప్రోగ్రామ్‌లు నిర్వహించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ కీర్తిని దిగజార్చేలా తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చి వక్రభాష్యాన్ని చెబుతుందన్నారు. సోనియా గాంధీ జన్మదినానికి తెలంగాణ తల్లికి ఏం సంబంధం? అన్నారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితి సరిగ్గాలేదు, అందుకే హామీలు అమలు చేయలేకపోయమని స్వయానమంత్రి శ్రీధర్‌బాబు నిజాయితీగా ఒప్పుకున్నారన్నారు. హామీలు అమలు చేయలేదని సిఎం రేవంత్ రెడ్డి ప్రజాక్షేత్రంలో క్షమాపణ చెప్పాలి.

## వానాకాలంలో వరి సాగు తగ్గ లేదు

### వ్యవసాయ శాఖ డైరక్టర్ గోపీ

**హైదరాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** గత వానకాలంతో పోల్చితే ఈ వానకాలంలో వరి సాగు ఉత్పత్తి తగ్గలేదని వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి స్పష్టం చేశారు. ఈ మేరకు ఒక ప్రకటనలో గత వానకాలం సీజన్‌లో 65.92 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, తద్వారా 144.85 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యిందన్నారు. ఈ వానకాలంలో తుది అంచనాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 66.78 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు అయిందని వివరించారు. ఈ వరిపంట ద్వారా మొత్తం వానాకాలం సీజనులో 156.26 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయినట్టు వెల్లడించారు.

## వరంగల్ మిర్చికి జీఐ ట్యాగ్

**హైదరాబాద్, డిసెంబరు 9, ప్రభాత వార్త:** రాష్ట్రంలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రత్యేకంగా పండిస్తున్న చపాట మిర్చికి జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ (జీఐ ట్యాగ్) లభించింది. ఇప్పటికే తెలంగాణ నుంచి పోచంపల్లి ఇక్కత్, కరీంనగర్ సిల్వర్‌ఫిలిగ్రీ, నిర్మల్ బొమ్మలు, హైదరాబాద్ హలీమ్‌తోపాటు మరి కొన్ని ప్రత్యేక ఉత్పత్తులు జీఐగుర్తింపు దక్కించుకున్నాయి. తాజాగా ఈ జాబితాలో దేశంలోని తీపి మిర్చి రకాల్లో ఒకటైన చపాట మిరప చేరింది. దీనిపై ఇండియన్ పేటెంట్‌ఆఫీస్ (ఐపీవో)కుదరఖాస్తుచేయగా ఆమోదించింది.

## ఆశాలపై లాఠీచార్జ్‌ని ఖండించిన నర్సయ్య గౌడ్

**హైదరాబాద్, డిసెంబరు 9 ప్రభాతవార్త:** ఆశా వర్కర్లు ఆరోగ్య రంగానికి వెన్నెముక వంటివారని మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. ఆశా వర్కర్లపై లాఠీచార్జ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

## గ్రూప్-2 హాల్ టికెట్స్ విడుదల

### 1368 కేంద్రాల్లో 15, 16 తేదీల్లో పరీక్షలు

**హైదరాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 783 గ్రూప్-2 పోస్టులకి సంబంధించిన పరీక్షల హాల్ టికెట్లను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) సోమవారం విడుదల చేసింది. గ్రూప్-2 పరీక్షలను ఈ నెల 15,16తేదిల్లో టీజీపీఎస్సీ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన హాల్ టికెట్లను సోమవారం కమిషన్ విడుదల చేసింది. కమిషన్ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రకటించింది. గ్రూప్-2 పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 1368 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 15, 16 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలను ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహించనున్నారు. ఇంకా అదనపు సమాచారం కావాలంటే టీజీపీఎస్సీ హెల్ప్‌లైన్ నంబర్లు 23542185/23542187/040224455 66కి కాల్ చేయాలని కమిషన్ సూచించింది.

## నేటి నుంచి సమ్మె చేయనున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

**హైదరాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది నేటి(మంగళవారం) నుంచి సమ్మె చేపట్టనున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారు సమ్మెకు వెళుతున్నట్టు తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం (టీఎస్ఎస్‌యూఎస్) ప్రకటించింది. విద్యాశాఖ లోని సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె మూలంగా కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలల్లో(కేజీబీవీ), అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్(యూఆర్ఎస్), భవిత సెంటర్ లల్లో బోధనతోపాటు, బోధనేతర పనులు ఆగిపోయనున్నాయి. గత ఏడాది సెప్టెంబర్ 13న హన్మకొండలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు విద్యాశాఖ లోని సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల అందరిని రెగ్యులర్ చెయ్యాలని ఆ లోపు తక్షణమే పే స్కెల్ అమలు చెయ్యాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య డిమాండ్ చేశారు.

## గ్రూప్-2 పరీక్షల వాయిదాకి నిరాకరించిన హైకోర్టు

### పిటిషన్లను కొట్టేసిన ఉన్నత న్యాయస్థానం

**హైదరాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 15, 16న జరగనున్న గ్రూప్-2 పరీక్షలు యధావిధిగా జరగనున్నాయి. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేసేందుకు రాష్ట్ర అత్యున్నత న్యాయ స్థానం నిరాకరించింది. ఇప్పటికే గ్రూప్-2 పరీక్షల ఏర్పాట్లు పూర్తయి నందున.. పరీక్షలను వాయిదా వేయలేమని హైకోర్టు స్పష్టం చేసింది. డిసెంబర్ 16న రైల్వే ఎగ్జామ్ ఉందని, ఒకే రోజు గ్రూప్-2 పరీక్షతో పాటు రైల్వే పరీక్షలు ఉన్నందువల్ల గ్రూప్-2ఎగ్జామ్‌ను వేరే తేదీకి మార్చాలని కోరుతూ పలు పిటిషన్లు హైకోర్టులో దాఖలయ్యాయి. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయడంవల్ల లక్షలాది మంది అభ్యర్థులు నష్టపోతారని టీజీపీ ఎస్సీ తరపున న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. టీజీపీఎస్సీ వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం గ్రూప్-2పరీక్షలను వాయిదా వేసేందుకు నిరాకరిస్తూ దాఖలైన పిటిషన్లను హైకోర్టు సోమవారం కొట్టేసింది.

## హెచ్ఎంగా పదోన్నతులు కల్పించాలి

### విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి పీఆర్‌టీయూ విజ్ఞప్తి

**హైదరాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ మరియు పంచాయతీరాజ్ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయుల పోస్టులను అడ్‌హక్ పద్ధతిన పదోన్నతులతో భర్తీ చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పింగిలిన శ్రీపాల్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి సోమవారం విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్ శ్రీధర్‌కి విజ్ఞప్తి చేశారు.

## పత్తి రైతుల దగా..లోడుకు 2 క్వింటాళ్ల వరకూ కోత

**హైదరాబాద్, డిసెంబరు 9, ప్రభాత వార్త:** రాష్ట్రంలో పత్తి రైతులు దగాకు గురవుతున్నారు. మద్దతు ధరల్లో భారీగా కోత పెడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుల నుంచి ట్రాక్టర్ లోడు 50 కేజీల నుంచి 2 క్వింటాళ్ల వరకు కట్టింగులు చేస్తూ రైతులను నిండా ముంచుతున్నారు. రాష్ట్రంలోని నల్లగొండ,ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, మెదక్ తదితర జిల్లాల్లో ఏర్పాటు చేసిన పలు కొనుగోలు కేంద్రానికి పత్తి అమ్ముకునేందుకు వచ్చిన రైతుల నుంచి నిర్వాహకులు 50 కేజీల నుంచి 2 క్వింటాళ్ల వరకు కోత విధిస్తూ నిట్టనిలువునా ముంచేస్తున్నారు. గత మంగళవారం మిల్లు వద్ద రైతులు ఆందోళన చేపట్టి దాదాపుగా నాలుగు గంటల పాటు కొనుగోళ్లను నిలుపుదల చేసి సీసీఐ నిర్వాహకులను నిలదీశారు. అయినప్పటికి సీసీఐ నిర్వాహకుల తీరు మారడంలేదు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కోతలు మాత్రం యదాతథంగా జరుగుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రతి యేటా డిసెంబరు 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవం

### తెలంగాణ తల్లి ఒక భావన కాదు తెలంగాణీయుల అస్థిత్వం భావోద్వేగం

### మెడకు కంఠె.. గుండుపూసల హారం.. అచ్చం రైతుబిడ్డలా తెలంగాణ తల్లి

### శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన



**హైదరాబాద్, డిసెంబరు9,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తొలి ప్రకటన వచ్చిన డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ దినంగా రాష్ట్రప్రభుత్వం అధికారికంగా గుర్తించిందని ప్రతీయేడు తెలంగాణతల్లి దినోత్సవం జరుకొని సబ్బండవర్ణాలు తెలంగాణకోసం జరిపిన పోరాటంను యాదికి చేసుకొందామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. సోమవారం అసెంబ్లీలో " నా తెలంగాణ కోటి రతనాల వీణ నా తెలంగాణ తల్లి కంజాత వల్లి" అంటూ మహాకవి దాశరథి కవితతో శాసనభలో ప్రకటన చేయడం ప్రారంభిస్తూ తెలంగాణ స్వప్నం సాకారం చేసిన సోనియాగాంధీ, తెలంగాణ ప్రజల గుండెల్లో చరిత్ర ఉన్నంతవరకు మధుర జ్ఞాపకంగా నిలిచిపోతారని చెప్పారు. తెలంగాణ తల్లి ఆకాంక్షలను గత ప్రభుత్వం నెరవేర్చలేకపోయిందని ఆవేదన చెందారు. ప్రజల ఆశయాలు,ఆకాంక్షలకు అనుగుణంగా మా ప్రభుత్వం నడుచుకుంటుందని అన్నారు. ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతోన్న సమయంలో ఉద్యమస్ఫూర్తితో తమ వాహనాలపై అందరు రాసుకున్న టిజి పదాలనే తాము అధికారికంగా ప్రకటించి ఆచరణలోకి తీసుకొచ్చామని గుర్తుచేశారు. గత పదేళ్ళ బిఆర్ఎస్ పాలనలో తెలంగాణకు రాష్ట్రీయ గీతమే లేదని ముఖ్యమంత్రి అన్నారు. అందుకే ఉద్యమ సమయంలో ప్రజలను ఒకతాటిపైకి తెచ్చిన కవి అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ఆమోదించామని రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ భూ ప్రపంచంలో ఏ జాతికైనా గుర్తింపు గౌరవం ఆ జాతి అస్థిత్వమే. ఆ అస్థిత్వానికి మూలం సంస్కృతి. ఆ సంస్కృతికి ప్రతిరూపమే తల్లి. స్వరాష్ట్ర సాధన సుదీర్ఘపోరాట ప్రస్తానంలో సకల జనులను సబ్బండ వర్గాలను ఐక్యంచేసి నడిపించిన శక్తి స్వరూపిణి తెలంగాణ తల్లి. నాలుగు కోట్ల ప్రజల ఆలోచనలు, ఆచరణలు,కార్యాచరణలన్నిటిని ఒక్కచోటుకు చేర్చి తెలంగాణ జాతిభావనకు జీవం పోసిన మాతృమూర్తి తెలంగాణ తల్లి. మనల్ని నిరంతరం చైతన్యపరిచి, లక్ష్య సాధన వైపు నడిపించిన గొప్పస్ఫూర్తి తెలంగాణ తల్లి అలాంటి తెలంగాణ తల్లి స్వరూపంపై పలురూపాలు ఇప్పటికే జనబాహుళ్యంలో ఉన్నాయి. వాటిలో దేనికి ఇప్పటి వరకు అధికార గుర్తింపులేదు. అధికారికంగా మనం గౌరవించుకోలేదు. "తెలంగాణ నేల.... స్వేచ్ఛ కోసం పిడికిళ్ళు బిగించిన ఉత్తేజపు జ్వాల! సకల జనులు ఒక్కటై గర్జించిన ఉద్వేగపు మాల!!" అటువంటి అనేక ప్రజా పోరాటాలకు ఊపిరి పోసిన మాతృమూర్తిని గౌరవించుకునే లక్ష్యంతో నేడు ప్రజా ప్రభుత్వం తెలంగాణ తల్లిని రూపకల్పన చేసి రాష్ట్ర సచివాలయం ప్రాంగణంలో ఆవిష్కరణ చేసే ఉత్సవానికి శ్రీకారం చుట్టింది. తెలంగాణ తల్లి అంటే ఒక భావన మాత్రమే కాదు నాలుగు కోట్ల బిడ్డల భావోద్వేగం. ఆ భావోద్వేగానికి నిండైన రూపం మన తెలంగాణ తల్లి. ప్రజల మనోఫలకంపై నిలిచిఉన్న తెలంగాణ తల్లిని మన సాంప్రదాయాలు, సంస్కృతి, చారిత్రాత్మక నేపథ్యం పరిగణలోకి తీసుకొని నిండైన రూపాన్ని తీర్చిదిద్దామని ముఖ్యమంత్రి ప్రకటనలో వివరించారు. కుడిచేతితో జాతికి అభయాన్నిస్తూ, ఎడమచేతిలో తెలంగాణ మాగాణంలో పండే సాంప్రదాయ పంటలైన వరి, జొన్నలు,సజ్జలు, మొక్కజొన్న పంటలతో మన సంస్కృతికి సాంప్రదాయానికి నిలువెత్తు రూపంగా తీర్చిదిద్దడం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విగ్రహాను వర్ణించారు. గోదావరి కృష్ణమ్మలు తల్లీనిను తడుపంగ అన్న అందెశ్రీ గీతంలోని జలదృశ్యానిక ప్రతిగా నీలిరంగులో ఉండే పీఠం నిలుస్తుందని రేవంత్‌రెడ్డి అన్నారు. పచ్చని మా నేలల్లో పసిడి సిరులు పండగ అంటూ తెలంగాణ రాష్ట్ర గీతంకు ప్రతీకగా ఆకుపచ్చని వర్ణం సస్యశామల వ్యవసాయకీర్తికి సంకేతంగా కనిపిస్తుందని ఆయన అన్నారు. ఎరుపు వర్ణం మార్పుకుప్రగతికి చైతన్యానికి ప్రతికలని ఆయన చెప్పారు. బంగారు వర్ణం శుభానికి ఐశ్వర్యానికి సమృద్ధికి నిదర్శనంగా నిలబడుతోందని ముఖ్యమంత్రి వివరణ ఇచ్చారు."పుట్టుక నీది చావునీది బ్రతుకంతా దేశానిది" కాళోజి మాటల స్ఫూర్తితో "టిజి"కి రాష్ట్ర గుర్తింపు ఇచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు. స్వరాష్ట్ర ఉద్యమంలో లక్షలాది మంది ఉద్యమజ్వాలలై వెలిగారని తమ ఉద్యమస్ఫూర్తిని చాటేందుకు ఆనాటి వలసవాద పాలకులపై ధిక్కారం వ్యక్తీకరణ కోసం తమ బండిపై గుండెపై టిజిగా పచ్చబొట్లు వేసుకున్నారని రేవంత్ తెలిపారు. అగ్నికీలలో తమ దేహాలు భగ్గున మండినా టిజి అక్షరాలను మాత్రం ప్రాణప్రదంగిఆ చూసుకున్నారని ఆయన తెలిపారు. అందుకే తెలంగాణ వచ్చిన పదేళ్ళతరువాత తెలంగాణ ఉద్యమానికి ఊపిరులు ఊదిన జయజయమే తెలంగాణ జననీ జయకేతనం గీతాన్ని అధికారిక గీతంగా ప్రకటించామని తెలిపారు. దురదృష్టవశాత్తు కొంతమందికి తెలంగాణ తల్లి ఆవిష్కరణ నచ్చలేదని ఆ విషయంలో రాజకీయాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

# నటుడు మంచు మనోజ్‌పై దాడి

### హైదరాబాద్ శివార్లలోని జల్‌పల్లి ఫాంహౌస్‌లో ఘటన

### పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మంచు మనోజ్

**హైదరాబాద్(సరూర్‌నగర్), డిసెంబరు 9 ప్రభాతవార్త:** తెలుగు సినీ పరిశ్రమలో ప్రముఖ సీనియర్ నటుడు, నిర్మాత మంచు మోహన్‌బాబు చిన్న కుమారుడు నటుడు మంచు మనోజ్ తనపై దాడి జరిగిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ నగర శివార్లలోని పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్‌కు సోమవారం సాయంత్రం వచ్చిన ఆయన ఇన్ స్పెక్టర్ గురువారెడ్డికి లిఖితపూర్వక ఫిర్యాదును అందజేశారు. స్థానిక జల్‌పల్లిలో తమకు సం బంధించిన మంచు టౌన్‌షిప్‌లోని ఫాంహౌస్‌లో తనపై దాడి జరిగిందంటూ ఆయన ఫిర్యాదులో పేర్కొన్నాడు. అదే విధంగా దాడిలో తనకు అయిన గాయాలకు గాను ప్రైవేటు ఆసుపత్రిలో చేయించుకున్న చికిత్సకు సంబంధించిన మెడికో లీగల్ రికార్డు సర్టిఫికెట్‌ను కూడా అందజేశారు. మంచు మనోజ్ అందజేసిన ఫిర్యాదు ప్రకారం ఇన్స్‌పెక్టర్ గురువారెడ్డి దాడికి సంబంధించి తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఉదయం జల్‌పల్లి మంచు టౌన్‌షిప్ ఫాంహౌస్ నివాసంలో ఫ్యామిలీతో ఉన్న సమయంలో దాదాపు పది మంది గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో మనోజ్ గట్టిగా అరుస్తూనే వారిని అడ్డుకునే ప్రయత్నంలో వారంతా పారిపోయారని తెలిపారు. అయితే దాడిలో మెడ, కడుపు తదితర భాగాల్లో గాయాలు కాగా మనోజ్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేందుకు వెళ్ళగా ఫాంహౌస్‌లో ఉన్న సిసి కెమెరా పుటేజీలను మాయం చేశారని పేర్కొన్నారు. కాగా తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందనీ ఈ నేపథ్యంలో దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని మనోజ్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా దాడికి గురై ఫిర్యాదు చేసిన మంచు మనోజ్ తన తండ్రి మోహన్‌బాబుపై గానీ ఏ ఇతర కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేయ లేదు. ఆస్తి తగాదాలనీ.. మోహన్‌బాబుకు మనోజ్‌కు గొడవ జరిగినట్లు తీవ్ర చర్చనీయాంశమై సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన నేపథ్యంలో మనోజ్ మాత్రం వాటికి సంబంధించి ఎక్కడా ప్రస్తావించకపోవడం గమనార్హం.

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తాం: ఇన్స్‌పెక్టర్ గురువారెడ్డి**

నటుడు మంచు మనోజ్‌పై జరిగిన దాడి ఉదంతానికి సంబంధించి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామని పహాడీషరీఫ్ ఇన్స్‌పెక్టర్ గురువారెడ్డి తెలిపారు. మనోజ్ ఫిర్యాదు చేసి వెళ్ళిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. దాడి జరిగినట్లు చెబుతున్న ఆదివారం రోజు డయల్ 100కు కాల్ వెళ్ళిన తర్వాత తమకు సమాచారం రాగా పహాడీషరీఫ్ పోలీసులు మంచు నివాసానికి వెళ్ళి విచారణ చేశారని తెలిపారు. మనోజ్ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో అన్ని కోణాల నుండి దర్యాప్తు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

### చిన్న కొడుకు మనోజ్, కోడలు మౌనికపై

## మోహన్‌బాబు ఫిర్యాదు

#### రాచకొండ కమిషనర్‌కు రెండు పేజీల లేఖను పంపిన మోహన్‌బాబు

మాజీ రాజ్యసభ సభ్యుడు మంచు మోహన్‌బాబు తన చిన్న కుమారుడు మంచు మనోజ్, కోడలు మౌనికలపై రాచకొండ పోలీస్ కమీషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన తన లెటర్ హెడ్‌పై రెండు పేజీల ఫిర్యాదు లేఖను కమీషనర్ సుధీర్‌బాబుకు పంపారు. తన కొడుకు, కోడలుతో పాటు సంఘ విద్రోహ శక్తులైన వారి మనుషుల నుండి తనకు ప్రాణహాని ఉందనీ మేరకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన లేఖలో కోరారు. ఈ లేఖ ప్రతులను పహాడీషరీఫ్ ఎస్‌హెచ్ఓ, పహాడీషరీఫ్ ఎసిపి, మహేశ్వరం డిసిపిలకు సైతం మోహన్‌బాబు పంపారు. తన చిన్న కుమారుడైన మనోజ్ నాలుగు నెలల క్రితం నా ఇంటిని విడిచి మళ్ళీ తిరిగి వచ్చాడనీ అయితే తనే కొంత మంది సంఘ విద్రోహ వ్యక్తులతో కలిసి తన ఇంటి వద్ద అలజడి సృష్టించి తర్వాత తన భార్య మౌనికతో కలిసి వెళ్ళాడని మోహన్‌బాబు లేఖలో పేర్కొన్నారు. మనోజ్, మౌనిక సూచనల మేరకు కొంత మంది వ్యక్తులు మాదాపూర్‌లోని తన కార్యాలయంలోకి బలవంతంగా ప్రవేశించి సిబ్బందిని బెదిరించారని తెలిపారు. అంతే కాకుండా తన నివాసాన్ని ఆక్రమించడానికి పనిచేస్తున్న ఉద్యోగులను సైతం బెదిరిస్తూనే ఉన్నారని ఆయన లేఖలో పేర్కొన్నారు. వీరందరి వల్ల తనకు తన ఇంట్లో ఉన్న వారికి ఆందోళన, ప్రాణ హాని ఉందని ఆయన తెలిపారు. తన కుమారుడు మనోజ్, కోడలు మౌనిక, వారి అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలనీ అదే విధంగా తన భద్రత కోసం రక్షణ కల్పించాలని ఆయన కమిషనర్‌ను కోరారు. కొడుకు, కోడలు, వారి మనుషులను తన ఆస్తి నుండి తొలగించాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు.

## సిరియాలోని సేద్నయా జైలు ఒక మానవ వధశాల

### 30 వేల మంది ఖైదీలను విడుదల చేసిన తిరుగుబాటు దారులు



మనుషుల వధ శాలగా మారిన సిరియాలోని సేద్నయా గల జైలు

**హైదరాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** సిరియాలో అల్ బషర్ సర్కారు కూలిపోయి అధ్యక్షుడుగా వున్న బషర్ రష్యాకు పారిపోవడంతో అతని హయాంలో ఆ దేశంలో సాగిన దారుణాలు ఒక్కోటి వెలుగుచూడసాగాయి. ఇందులో సేద్నయా అనే ప్రాంతంలో గల జైలు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సి వుంది. ఈ జైలును మానవ వధశాలగా అక్కడి ప్రజలు చెబుతున్నారు. ఈ జైలులో బషర్ సర్కారుకు వ్యతిరేకంగా గళం ఎత్తినవారిని నిర్బంధించి చంపేస్తుంటారని అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ అమ్నెస్టీ గతంలో పలు సందర్భాలలో వెల్లడించగా ఇప్పుడు బషర్ సర్కారు పతనమయ్యాక ఈ జైలులో మగ్గుతున్న ఖైదీలను తిరుగుబాటుదారులు విడుదల చేశారు. ఇందులో ఒక్క ఫ్లోర్‌లోనే 30 వేల మంది ఖైదీలు వున్నట్లు అంతర్జాతీయ మీడియా సంస్థలు వెల్లడించాయి. సేద్నయా జైలు సిరియా రాజధాని డమస్కస్‌కు దగ్గరగా వుంది. ఈ ప్రాంతం బషర్ ఆధీనంలోనే వుండడంతో తిరుగుబాటుదారులు, ప్రభుత్వంపై విమర్శలు చేసేవారు. ఆందోళన చేసేవారిని సేద్నయా జైలులో ఏళ్ల తరబడి నిర్బంధించేవారు. ఇక సేద్నయా జైలులో మూడు బ్లాకులు వుంటాయి. రెడ్ బిల్డింగ్, వైట్ బిల్డింగ్ వీటిలో ముఖ్యమైనవి. ఆందోళనకారులను రెడ్ బిల్డింగ్‌లో వుంచేవారు. వైట్ బిల్డింగ్‌లో ఇతర ఖైదీలను వుంచేవారు. సేద్నయా జైలులో ఉరిశిక్ష అమలుకోసం ప్రత్యేక విభాగం వుంది. సిరియా వ్యాప్తంగా గడచిన పదేళ్ల కాలంలో అనేక కారణాలతో లక్ష మందిని ఉరితీయగా ఇందులో ఒక్క సేద్నయా జైలులోనే 30 వేల మందిని ఉరితీసినట్లు అమ్నెసీ ఇంటర్నేషనల్ పేర్కొంది. ముస్లిం దేశాలలో ఉరితీసిన ఖైదీల మృతదేహాలను ఖననం చేయడం ఆనవాయితీ. కానీ సిరియాలో దీనికి భిన్నంగా మృతదేహాలను ప్రత్యేకమైన యంత్రంలో పెట్టి మాంసంముద్దగా మార్చి పేపర్‌గా మార్చేవారు. సిరియాను తిరుగు బాటుదారులు స్వాధీనం చేసుకున్నాక సేద్నయా జైలులోని 30 వేల మందికి పైగా ఖైదీలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈ జైలులోని అనేక బ్లాకుల్లోలల ఖైదీలకు అమలవుతున్న శిక్షలను అక్కడి ఖైదీలు కళ్లకుకట్టినట్లు వివరించారు.

## ఐసిస్ స్థావరాలపై అమెరికా దాడులు

### ఐసిస్‌కి చావుదెబ్బగా అంతర్జాతీయ నిపుణుల వెల్లడి

**హైదరాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** కొన్నేళ్ల క్రితం ప్రపంచ దేశాలను గడగడలాడించిన ఇస్లామిక్ స్టేట్స్ (ఐసిస్)కు సిరియాలో వున్న కొద్దిపాటి స్థావరాలను కూడా ఆ దేశంలో బషర్ సర్కారు పతనం తరువాత అమెరికా ధ్వంసం చేసింది. ఈ దాడులతో ఐసిస్ ఇక కోలుకోవడం కష్టమేనని అంతర్జాతీయ నిపుణులు అంటున్నారు. ఇక ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే సెంట్రల్ సిరియా లో 75 స్థావరాలను ఐసిస్ కలిగివున్నట్లు అమెరికా గుర్తించింది. సిరియాలో అమెరికా మద్దతు వున్న తిరుగుబాటు గ్రూపు ధాటికి అధ్యక్షుడు బషర్ రష్యాకు పారిపోవ డం తెలిసిందే. ఇదే సమయంలో సిరియాలో గల ఐసిస్ స్థావరాలపై అమెరికా బాంబర్లు విరుచుకుపడ్డాయి. బి 52, ఎఫ్ 15, ఏ 10 బాంబర్ల సహాయంతో అమెరికా వైమానిక దళం ఐసిస్ స్థావరాలపై దాడులకు దిగింది. సిరియాలో నెలకొన్న అంతర్యుద్ధం వల్ల ఐసిస్ బలబడకుండా వుండేందుకు ఈ దాడులు చేసినట్లు అమెరికా రక్ష ణ సంస్థ పెంటగాన్ తెలిపింది. గతంలో ఇరాక్‌లో సద్దాం హుస్సేన్ ప్రభుత్వం పతనమయ్యాక అక్కడ ఐసిస్ అనూహ్యంగా బలపడడం తెలిసిందే. సిరియాలో కూడా ఇదే విధంగా బలపడేందుకు ఐసిస్ వ్యూహం రచించినట్లు అమెరికా నిఘా వర్గాలకు సమాచారం అందగా వైమానిక దళం ఒక్కసారిగా బాంబర్లలో దాడులకు 75కు పై గా స్థావరాలను ధ్వంసం చేసింది.

## సైబరాబాద్ సిసిఎస్‌కు చిక్కిన రాజస్తాన్ గజదొంగ: తొమ్మిది కేసుల్లో మోస్ట్ వాంటెడ్ నేరగాడు

**హైదరాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** నగర శివారు ప్రాంతాలలో వరుసగా దొంగతనాలు. దోపిడీలకు పాల్పడుతూ మూడేళ్లకు పైగా తప్పించుకు తిరుగుతున్న మో స్ట్ వాంటెడ్ నేరగాడు రాజస్తాన్‌కు చెందిన ప్రదీప్ (30)ను సైబరాబాద్ సిసిఎస్ పోలీసులు అరెస్టు చేశారు. సైబరాబాద్ సిసిఎస్ డిసిపి నరసింహా దీనికి సంబంధించిన వివరాలను సోమవారం మీడియాకు వెల్లడించారు. రాజస్తాన్‌లోని బిచౌలా అనే గ్రామానికి చెందిన ప్రదీప్ కొంత కాలంగా శివార్లలోని కొల్లూరు, మోకిల, నార్సింగి ప్రాంతాలలో తొమ్మిదిచోట్ల దొంగతనాలు, దోపిడీలకు పాల్పడ్డాడు. ఇతనిపై ఈ తొమ్మిది కేసులతో పాటు మరికొన్ని కేసులు కూడా వున్నాయి. కొన్నిచోట్ల ఇతను తుపాకులను వాడినట్లు తేలింది. ఈ నేపథ్యంలోనే ఆయుధ చట్టంలోని సెక్షన్ కూడా ఇతనిపై నమోదు చేశారు. ఇతని గురించి గాలించగా రాజస్తాన్‌లోని తన సొంత ఊరులో వున్నట్లు సమాచారం అందడంతో సైబరాబాద్ పోలీసులు ఒక బృందంగా ఏర్పడి బచౌలికి వెళ్లి అక్కడ వున్న రమేష్‌ను పట్టుకున్నారు. అనంతరం అతన్ని స్థానిక కోర్టులో హాజరు పరిచి ట్రాన్సిట్ వారంట్‌తో ఇక్కడకు తరలించి ఇక్కడి కోర్టులో హాజరు పరిచి రిమాండుకు తరలించారు. నిందితుడిపై తొమ్మిది నాన్‌బెయిలబుల్ వారంట్లు పెండింగ్‌లో వున్నాయి.

## ఖనిజేతరాల ద్వారా 500 గిగావాట్ల ఎనర్జీ లక్ష్యం

### 18యేళ్ల పాటు ట్రాన్స్‌మిషన్ చార్జీల మాఫీ

### రుణాల మాఫీ, రాయితీలపై మార్గదర్శకాలు

**హైదరాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** దేశంలో ఖనిజేతర ఎనర్జీ ఆధారిత వనరుల ద్వారా 500 గిగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన యూనిట్లను ఏర్పాటు చేసేందుకు కేంద్రం ప్రణాళికను రూపొందించింది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అధికారవర్గాల వివరాల ప్రకారం కొత్త జల విద్యుత్ ప్రాజెక్టుల కోసం 18 ఏళ్ల పాటు వీలింగ్ విద్యుత్‌పై అంతరాష్ట్ర ట్రాన్స్‌మిషన్ చార్జీలను మాఫీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే సోలార్, విండ్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులకు రుణాల మాఫీ అందుబాటులో ఉంది. ఈ ప్రణాళికలో భాగంగా వచ్చే 2030 సంవత్సరం నాటికి ఖనిజేతర ఎనర్జీ ఆధారిత వనరుల నుండి 500 గిగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉండాలని అందులో స్పష్టం చేసింది. అయితే 2025 జూన్ 30వ తేదీ తర్వాత నిర్మాణ పనులు మంజూరు చేయబడిన విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లకు పిపిఎ విషయంలో సంబంధిత ప్లాంట్ల నుండి విద్యుత్ ప్రసారం కోసం ఐఎస్‌టిఎస్ చార్జీలు వివిధ దశలలో ఉన్న వాటికి నిర్ణీత విధంగా వసూలు చేయబడతాయని స్పష్టంగా పేర్కొంది. కాగా పనులు మంజూరు చేయబడిన, పిపిఎలు 2025 జూన్ 30కు జూలై 1వ తేదీకి మధ్య సంతకం చేయబడిన జల విద్యుత్ ప్రాజెక్టుల కోసం 25 శాతం వరకూ ఐఎస్‌టిఎస్ చార్జీలు వసూలు చేయబడతాయి. అదే విధంగా 2026 జూలై 1 నుండి 2027 జూలై 1వ తేదీ మధ్య కాలంలో విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల నిర్మాణ పనులు మంజూరు చేయబడి, విద్యుత్ సరఫరాకై పిపిఎ సంతకాలు చేయబడిన ప్రాజెక్టులకు 50 శాతం, 2028 జూన్ 30వ తేదీ వరకూ అయితే 75 శాతం చొప్పున ఐఎస్‌టిఎస్ చార్జీలు అమలు చేయనున్నట్లు వెల్లడించింది.

## 4లక్షల ఎరియర్స్ కోసం రూ. 40 వేలు డిమాండ్

### ఎసిబికి పట్టుబడ్డ ట్రెజరీ అకౌంటెంట్ నగేష్



**క్రైమ్ ఖమ్మం డిసెంబరు 9 ప్రభాతవార్త:** బాధ్యత కలిగిన ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత రాహిత్యాన్ని మరిచి ఓ మహిళను పలుమార్లు ఇబ్బంది పెట్టి చివరకు అవినీతి నిరోధక అధికారుల తనిఖీలో రెడ్ హ్యాండ్‌గా పట్టుబడిన సంఘ టన ఖమ్మంలో సంచలనం సృష్టించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ డిఎస్పి వై రమేష్ కథనం ప్రకారం సోమవారం జిల్లా కలెక్టరేట్లోని ట్రెజరీ విభాగంలో అధికారులు ముకుమ్మడిగా సోదాలు నిర్వహించడంతో ట్రెజరీ సీనియర్ అకౌంటెంట్ కట్టా నగేష్ ను వలపన్ని పట్టుకున్నారు. విశ్రాంత అటెండర్ భార్యకు రావలసిన రూ4లక్షల ఏరియర్స్ మంజూరు కొరకు పెన్షనర్ నుండి 10 శాతం అనగా రూ. 40వేలు డిమాండ్ చేశాడు. ఖమ్మం జిల్లా తిరుమలయపాలెం మండలం సుబ్లేడ్లే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అటెండర్ గా విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యాడు. తన భర్త కు రావలసిన ఏరియర్స్ పెన్షన్ కోసం ఆమె దరఖాస్తు చేసు కుంది, సీనియర్ అకౌంటెంట్ నగేష్ తో ఆమె ఫోన్లో మాట్లాడిన ఆడియో వీడియో రికార్డుల ఆధారంగా నిర్ధారణ కావడంతో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు, బాధితురాలు ఏరి యర్స్ మంజూరు కోసం సోమవారం ఉద్యోగ నగేష్ తో చర్చిస్తున్న క్రమంలో మరోసారి ఆమెను తన వాటా రూ 40వేలు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశాడు, దీంతో అక్కడే కాపు వేసి ఉన్న ఏసీబీ డిఎస్పి వాళ్లకు చిక్కాడు ఏసీబీ కోర్టులో హాజరుపరిచి రిమాండ్ తరలించనున్నట్లు స్పష్టం చేశారు.

## మాజీ సర్పంచ్‌ల హౌస్ అరెస్టులను ఖండించిన హరీష్‌రావు

**హైదరాబాద్, డిసెంబరు 9 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామపంచాయతీలలో పెండింగ్ బిల్లులు చెల్లించాలని మంత్రులకు వినతి పత్రాలు ఇచ్చేందుకు వస్తున్న మాజీ సర్పంచ్ సంఘం నాయకులను, మాజీ సర్పంచ్‌లను పోలీసులు ఎక్కడికక్కడే అరెస్టులు చేశారు. కాగా పోలీసులు మాజీ సర్పంచ్‌లను హౌజ్ అరెస్టు చేయడంపై మాజీ మంత్రి హరీష్‌రావు మండిపడ్డారు. తమ న్యాయమైన డిమాండ్‌ల కోసం సర్పంచ్‌లు గొంతెత్తితే పాపం అన్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం శోచనీయమన్నారు.

## తెలంగాణతో బిఆర్ఎస్‌కు ఎప్పుడో బంధం తెగింది

### ఆర్అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 9,ప్రభాతవార్త:** తెలంగాణతల్లి విషయంలో బిఆర్ఎస్ చేసే వ్యాఖ్యలకు అర్థంలేదని వారికి తెలంగాణతో ఉన్న బంధం ఏనాడో తెగిపోయిందని ఆర్అండ్‌బి,సినిమాటోగ్రఫి మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోనియాగాంధీ లేకుంటే ఈ జన్మలోనే కాదు మరోజన్మలో కూడా తెలంగాణ వచ్చేది కాదని మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోనియా గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపాల్సిందిపోయి బిఆర్ఎస్ నేతలు బయట గొడవ చేస్తున్నారని దుయ్యబట్టారు.

## తెలంగాణ తల్లి వ్యక్తికి, కుటుంబానికి పరిమితం కాదు

### మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త :** తెలంగాణ రావడానికి కారకులైన సోనియా గాంధీ లేకుంటే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు సాధ్యమయ్యేది కాదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ ఏర్పడి పదేళ్లయినా అధికారిక గేయం లేదనీ, తెలంగాణ సెంటిమెంట్‌కు అనుగుణంగా ప్రభుత్వం రాగానే అధికారిక గీతాన్ని ఏర్పాటు చేశామన్నారు. సోమవారం అసెంబ్లీలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై జరిగిన చర్చలో పొన్నం మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహం ఎక్కడా అధికారికంగా లేదనీ, అది ఒక పార్టీకి సంబంధించి అఫ్లికేటెడ్ తప్ప అధికారిక విగ్రహం కాదన్నారు.

